క్లుప్తంగా

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి


జూమ్ కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: ప్రస్తుత కాలంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రధాన కేసులను ఛేదించాలని ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో శనివారం అదనపు ఎస్పీ కేవీ రమణ(అడ్మిన్)తో కలిసి జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. అధికారులతో మహిళలపై జరుగుతున్న నేరాలు, కేసుల నమోదు, దర్యాప్తు, నాన్ బెయిల్‌బుల్ వారెంట్ల అమలు, పెండింగ్‌నకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మహిళా పోలీసులు గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలు, మహిళల భద్రత, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలు తెలిపి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు గురించి సమాచారాన్ని సేకరించేలా చర్యలు చేపట్టాలన్నారు. శక్తియాప్ ఉపయోగాలు, డయల్ 112 గురించి అవగాహన కల్పించాలని, ఎన్‌బీడబ్ల్యూ అమలుకు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించాలన్నారు. కార్యక్రమంలో సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నగర సంకీర్తన

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కలెక్టర్ బంగ్లా వద్ద డాక్టర్ శ్రీనివాస పట్నాయక్ చారిటీస్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ప్రవచనాల నగర సంకీర్తన శనివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి జన్మ రహస్యాలపై ప్రత్యేక గీతాలను ఆలపించారు. ఈనెల 16, 17 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుగుతాయని, 16న చల్లకంబాల కార్యక్రమం, 17న శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తామని పన్నీరు అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పట్నాయక్, బగ్గం చిన్ననాయుడు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో ముజేటి శ్రీనివాస్, స్వప్న, రాజేశ్వరమ్మ, తరుణ్, దుర్గారావు, డాక్టర్ వినీలబాయి పట్నాయక్, కర్నేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు


విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న అధికారులు

జి.సిగడాం: మండలంలోని పాలఖండ్యాం యూపీ పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారులు అరసాడ రవి, ముఖ్ల శ్రీనివాసరావు కలిసి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం విద్యతోపాటు మెరుగైన పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. ప్రతీ పాఠశాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారన్నారు. అనంతరం విద్యార్థి మిత్ర కిట్స్‌ను పరిశీలించారు. వారితో పాటు ఉపాధ్యాయులు కుదమ తిరుమలరావు, వైపీ రమణ, రాము, ముఖ్ల సుజాత, అదిలక్ష్మి తదితరులు ఉన్నారు.

జ్వరాలపై ఇంటింటా సర్వే

జి.సిగడాం: మండలంలోని టంకాల దిగ్గువలస గ్రామంలో జ్వరాలపై ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది సర్వే చేపడుతున్నారని వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబింధు శనివారం తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో 5 బృందాలతో ప్రత్యేకంగా సర్వే చేపడుతున్నామని వెల్లడించారు. ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి అసిరయ్య చొరవతో గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి బ్లీజింగ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక గుజరాతీపేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించారు. శ్రీవేంకట రామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. అలాగే మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామావళి జరిపించారు. స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయవాదులకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో పని ఒత్తిడితో ఉండే న్యాయవాదులు, న్యాయ సిబ్బందికి ఈ క్రీడలు ఉపశమనం కలిగించడంలో ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎస్.శ్రీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగీ శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, ఉపాధ్యక్షుడు ఇప్పిలి సీతరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగు జరిగేదెలా..?

- తోటపల్లి ద్వారా అందని సాగునీరు
- ఎండిపోతున్న శివారు భూముల్లో పంటలు
- ఆందోళనలో అన్నదాత


కొండములగాం సమీపంలోని తోటపల్లి కాలువ


తాళ్లవలస సమీపంలో ఎండిపోతున్న వరి వెదలు

రణస్థలం: తోటపల్లి కాలువ ద్వారా శివారు గ్రామాలకు ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీరు అందే సూచనలు కనిపించడం లేదు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాల్లోని తోటపల్లి కాలువ ప్రధాన కాలువలో కొంతమేర పనులు చేసినా, పిల్ల కాలువల ద్వారా వచ్చే నీరు పూర్తిగా ప్రశ్నార్థకంగా మారిపోయింది. కూటమి ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడం వలన ప్రధాన కాలువలో కొండములగాం వరకు మాత్రమే పూడికతీత పనులు చేపట్టి వదిలేశారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పిల్ల కాలువల భూసేకరణ, తవ్వకాల పనులు ఎక్కడ వేసిన గొంగళిలా అలానే ఉండిపోయింది. దీంతో శివారు గ్రామ రైతులకు సాగునీరు అందే అవకాశం లేకుండా పోయింది. రణస్థలం మండలంలో 21,150 హెక్టార్లకు, లావేరులో 11,008 హెక్టార్లకు, జి.సిగడాంలో 6,373 హెక్టార్లకు ఈ తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందేలా ప్రణాళికలు రూపొందించారు. అయితే కాలువల్లో గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు పేరుకుపోవడం, పిల్ల కాలువలు పూర్తి కాకపోవడంతో పాటు ఈ ఏడాది సాగునీరు పూర్తి స్థాయిలో వదలకపోవడంతో పంటలు ఎండిపోయి అన్నదాత గగ్గోలు పెడుతున్నారు.

నీటిజాడ కరువు

గతేడాది సాగునీరు సకాలంలో అందకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేవరాపల్లి, వెల్పురాయి, కమ్మసిగడాం, బంటుపల్లి వరకు మాత్రమే సాగునీరు అరకొరగా వచ్చి ఆగిపోయింది. వర్షాలు సక్రమంగా లేకపోవడంతో వరి పొలాలు ఎక్కడికక్కడే ఎండిపోయిన పరిస్థితి చూశాం. దేరసాం, కోష్ట, తెప్పలవలస, పైడిభీమవరం, తామాడ వైపు ప్రధాన కాలువతో పాటు పిల్ల కాలువలు పూర్తి కాకపోవడంతో ఎచ్చెర్ల నియోజకవర్గంలో రైతన్నల సాగు కష్టాలకు ముగింపు దొరకడం లేదు. ఈ ఏడాది శ్రీకాకుళం బ్రాంచి కాలువకు రూ.19 లక్షల మేర అరకొర నిధులు కేటాయించడంతో పూడికతీత పనులు అంతంతమాత్రంగానే జరిగాయి. చీపురుపల్లి మండలంలోని నడిపల్లి వరకు మాత్రమే నీరు వచ్చి ఆగిపోయింది. తోటపల్లి కాలువ వస్తుందని తద్వారా తమ చెరువులు, పరివాక పంటలకు సాగునీరు అందుతుందని ఆశతో రైతులు పిల్ల కాలువలు వాళ్లే తవ్వుకున్నారు. ఇటీవల బంటుపల్లి గ్రామ రైతులు జగనన్న కాలనీ ఎదుట ఇలానే కాలువ తవ్వుకున్నా సాగునీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలువ తవ్వకం వలన కాలనీ వాసుల రహదారికి సమస్య ఉత్పన్నమై వాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. కాలువ మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రకటనలు తప్ప పనులు లేవు

కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చాక తోటపల్లి కాలువ ద్వారా శివారు గ్రామాలకు సాగునీరు అందించడమే తమ లక్ష్యమని పాలకులు చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఖరీఫ్ సీజన్ వచ్చి రెండు నెలలు గడుస్తున్నా, వరి, మొక్కజొన్న నాట్లువేసి సాగునీరు కోసం ఎదురు చూస్తున్నా కార్యాలయాల్లో తోటపల్లి అధికారులతో రివ్యూ సమావేశాలే తప్పా, పనుల్లో ఫలితం కనిపించడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండో ఖరీఫ్ సీజన్ రెండు నెలలైనా పనుల్లో పురోగతి కనిపించడం లేదు.

సాగునీరు అందించడంలో విఫలం

> ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తున్నా తోటపల్లి కాలువ ద్వారా ఇప్పటివరకు ఒక్కచుక్క కూడా నీరు రణస్థలం మండలానికి కూటమి నాయకులు తీసుకురాలేకపోయారు. పూర్తిస్థాయిలో పిల్ల కాలువల తవ్వకాలు ఊసే లేదు. దీంతో సాగు నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఖరీఫ్‌కు మండలంలోని శివారు గ్రామాలకు సాగునీరు అందే సూచనలు కనిపించడం లేదు.
>
> – గొర్లె శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, రణస్థలం

ఫ్లో లేకపోవడంతో ఇబ్బందులు

> శ్రీకాకుళం బ్రాంచి కెనాల్‌కు తోటపల్లి కాలువ సాగునీరు విడిచిపెట్టినా ఫ్లో సరిగా లేకపోవడంతో చీపురుపల్లి మండలం నడిపిల్లి వరకే వచ్చి ఆగిపోయింది. పూడికతీత పనులు సాధ్యమైనంత వరకు చేయగలిగాం. బంటుపల్లి జగనన్న కాలనీ ఎదుట పిల్ల కాలువ మేము తవ్వలేదు. పిల్ల కాలువల పనులు ఎక్కడా మొదలు పెట్టలేదు. తగినంత వర్షాలు పడితే మరో పది రోజుల్లో కాలువ నీరు తెప్పిస్తాం.
>
> – కె.లావణ్య ప్రియదర్శిని, డీఈఈ, తోటపల్లి ప్రాజెక్టు


కొండములగాంలో ఎండిపోతున్న మొక్కజొన్న


బంటుపల్లి జగనన్న కాలనీ ఎదురుగా రైతులు తవ్విన పిల్ల కాలువ

మోసం చంద్రబాబు నైజం


చంద్రబాబు మోసాలు ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రణస్థలం: ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, ఆ తర్వాత వాటిని అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రణస్థలం, గోసాం, మహంతి పాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు స్కాన్ చేసి ప్రజలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. తల్లికి వందనం పథకాన్ని అర్హులందరికీ అందజేయలేదని దుయ్యబట్టారు. మహిళలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు, బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి రమేష్, రణస్థలం ఎంపీటీసీ పెద్దింటి గౌరి, కరిమజ్జి రమణ, మాజీ సర్పంచ్ కరిమజ్జి భాస్కరరావు, మాజీ ఎంపీటీసీ మహంతి జోగినాయుడు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ చందక రమణ, మహంతిపాలెం, కృష్ణాపురం సర్పంచ్‌లు గొర్లె అప్పలనర్సునాయుడు, కంబాపు రామిరెడ్డి, నాయకులు కెల్ల రమణ, రెడ్డి అప్పలనాయుడు, ఆళ్ల అసిరయ్య, గొర్లె సీతారాం, గిన్ని నాయుడు, సీరపు అప్పన్న తదితరులు ఉన్నారు.

ఉత్తర్వులు తక్షణమే రద్దు చేయాలి


పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీయడానికి ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని, ఐఎంఎల్ డిపోకి భూములిచ్చిన కార్మికుల పొట్టలు కొట్టొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు కోసం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని కోరుతూ శనివారం ఐఎంఎల్ డిపో వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీలు పొర్లు దండాలు పెట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల భూములు తీసుకుని పరిహారంగా ఉపాధి కల్పించి, ఇప్పుడు ఆయా కుటుంబాలు ఉపాధి కోల్పోయేలా ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమన్నారు. అవసరం లేకున్నా డిపోను విడదీయాలనుకోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హమాలీల యూనియన్ నాయుకులు టి.రామారావు, ఎం.సురేష్, బోనెల రాము, లింగాల రాము, జి.గురుమూర్తి, పట్నాన రామారావు, ఎల్.సీతారాం, రాజు, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి బాటలు వేయండి



ప్రమాణ స్వీకారం చేస్తున్న పీడీ, పీఈటీ సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మారుతున్న క్రీడా ప్రమాణాలను అమలు చేస్తూ.. పాఠశాలల్లో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి వ్యాయామ ఉపాధ్యాయులు బాటలు వేయాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు, పీఈటీ సంఘ ముఖ్య సలహాదారు పి.సుందరరావు సూచించారు. హెచ్ఎంలను సమన్వయం చేసుకుంటూ పాఠశాలల్లో క్రీడా పండగ వాతావరణాన్ని సృష్టించాలని ఆకాంక్షించారు. శ్రీకాకుళం జిల్లా పీడీ–పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్లలో పనిచేస్తున్న పీడీ–పీఈటీల జిల్లాస్థాయి సెమినార్ కమ్ వర్క్‌షాప్ శనివారం సాయంత్రంతో ముగిసింది. జిల్లా పీఈటీ సంఘ పూర్వ అధ్యక్షుడు, ప్రస్తుత ప్రధాన కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ అధ్యక్షతన రెండు రోజులపాటు జరిగిన ఈ సెమినార్‌లో భాగంగా రెండోరోజు వివిధ క్రీడాంశాల్లో మారిన క్రీడా విధానాలు, టెక్నికల్‌గా మార్పులు, నూతన విధివిధానాలతోపాటు పాఠశాలల్లో నిర్వర్తించాల్సిన క్రీడా రికార్డులు గురించి వివరించారు. స్కూల్ గేమ్స్ పోటీల షెడ్యూల్, కొత్త రూల్స్, గ్రిగ్స్‌మీట్ పోటీల వేదికలు, క్రీడాపోటీల నిర్వహణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, కమిటీల నియామకం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కొత్తగా ఎన్నికైన పీడీ, పీఈటీలతోపాటు కొత్తగా ఏర్పాటైన నాలుగు జోన్ల అధ్యక్ష, కార్యదర్శులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పి.సుందరరావు, పీఈటీ సంఘ నూతన అధ్యక్షుడు పి.తవిటయ్య, ఎస్.సూరిబాబు, బీవీ రమణ, కె.మాధవరావు, రవి, కామయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


లక్ష్మణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కిరణ్ కుమార్ తదితరులు

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె లక్ష్మణరావు, జీరుపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి లక్ష్మయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. అలాగే వెల్పురాయి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురాన అప్పలస్వామి, ఆ గ్రామ మాజీ సర్పంచ్ యలకల బుచ్చినాయుడు, సంచాం గ్రామంలోని మీసాల చక్రధర్(శ్రీహరి), అదే గ్రామానికి చెందిన పతివాడ అప్పలనాయుడులు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసి వాళ్లను పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, సంచాం సర్పంచ్ రెడ్డి రాము, మాజీ ఎంపీటీసీ కెల్ల రామకృష్ణ, నాయకులు పిల్ల ఆనంద పాత్రుడు, గురాన ప్రసాద్, కెల్ల సత్యనారాయణ, రెడ్డి ఆనంద్, రామకృష్ణంనాయుడు, దాలినాయుడు, అయ్యప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ విభాగాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌వో వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జూనియర్ రెడ్‌క్రాస్ విభాగాలు ఏర్పాటు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ నిర్వహణ, ఏర్పాట్లపై సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ హైస్కూల్, కళాశాలలో జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ విభాగాలు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో సేవాతత్వాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసమే సంస్కరణలు

- ఇంటర్ విద్య ఆర్జేడీ ఆదినారాయణ


మాట్లాడుతున్న ఆర్జేడీ మజ్జి ఆదినారాయణ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియట్ విద్యలో విద్యార్థుల ఉపయుక్తం కోసమే ప్రభుత్వం సంస్కరణలు తీసుకురావడం జరిగిందని ఇంటర్ విద్య ఆర్జేడీ మజ్జి ఆదినారాయణ పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కేంద్రంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న సైన్స్ లెక్చరర్ల ఓరియంటేషన్ క్లాసులు శనివారం మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లెక్చరర్లకు వారివారి సబ్జెక్టులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నదే ఇంటర్ విద్య డైరెక్టర్ ఆలోచనని పేర్కొన్నారు. మార్పులు చేసిన సిలబస్‌పై అవగాహన పెంచుకుని, అలాగే మారిన ప్రశ్నపత్రం గురించి ప్రతి ఒక్కరి దగ్గర బ్లూప్రింట్ ఉండాలన్నారు. సకాలంలో సిలబస్‌లు పూర్తిచేసి, విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేయాలని సూచించారు. సైన్స్ విద్యార్థులకు వారాంతపు పరీక్షలను నిర్వహిస్తున్నామని, వాటిని చాలా సీరియస్‌గా తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ బొమ్మలాట శ్యామ్‌సుందర్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్స్‌తో జిల్లా ఆర్ఐవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీవీఈవో ప్రగడ దుర్గారావు, విజయనగరం డీవీఈవో శివ్వాల తవిటినాయుడు, ప్రిన్సిపాల్స్ బి.శ్యామ్ సుందర్, అప్పలరాము, మొదలవలస కృష్ణవేణి, విజయలక్ష్మి, పద్మావతి, సునీత, పవన్, అప్పన్న, కె.తవిటినాయుడు, జి.వెంకటేశ్వరరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఏకపాత్రాభినయ పోటీలు


కళాకారుడి ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య 310వ నెలవారి సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో బొత్స అప్పలస్వామి (మర్రివలస మాస్టర్) స్మారక ఉత్తరాంధ్ర స్థాయి పౌరాణిక, సాంఘిక, జానపద నాటక ఏకపాత్రాభినయం పోటీలు శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా 33 మంది కళాకారులు తమ కళలను ప్రదర్శించారు. పోటీల్లో ప్రథమ బహుమతి ఖాతా హరిబాబు, ద్వితీయ బహుమతి కిమ్మి సంతోష్ కుమార్, తృతీయ బహుమతి బోనం గురుమూర్తిలు గెలుచుకున్నారు. కార్యక్రమంలో పౌరాణిక కళాకారుడు పద్మశ్రీ ఎడ్ల గోపాలరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు పన్నాల నరసింహమూర్తి, గౌరవాధ్యక్షుడు ఎల్.రామలింగ స్వామి, కార్యదర్శి బంటుపల్లి రామచంద్ర దేవ్, రమణారావు, పొట్నూరు వెంకట్రావు, కంచరాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం


తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సీతామహలక్ష్మి


శ్రీకాకుళం అర్బన్: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

శ్రీకాకుళం అర్బన్:

బిడ్డలకు తల్లిపాలు అమృత సమానమని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్ట్ కృష్ణాపార్కు సెక్టార్ సూపర్‌వైజర్ పి.సీతామహలక్ష్మి అన్నారు. నగరంలోని కృష్ణాపార్క్ సెక్టార్ పరిధిలోని బాకర్ సాహిబ్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు అందించారు. పుట్టిన గంటలో బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం వలన ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ఎం.మన్మథరావు, ఎస్వీ రమణ మాదిగ, ఎల్.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు గూనపాలెం సెక్టారు సూపర్‌వైజర్ బి.యోగీశ్వరి అన్నారు. నగరంలోని గూనపాలెం సెక్టారు పరిధి పాతగూనపాలెం, కొత్తగూనపాలెం అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో అధికంగా పోషకాలు, విటమిన్‌లు ఉంటాయన్నారు. తల్లిపాలు తాగడం వలన తల్లికి, బిడ్డకు మధ్య అనుబంధం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు టి.రాజేశ్వరి, బి.ఆదిలక్ష్మి, ఎ.హైమరత్నం పాల్గొన్నారు.

సత్తాచాటిన రైజ్ అకాడమీ

శ్రీకాకుళం న్యూకాలనీ: తాజాగా విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ ఫలితాల్లో శ్రీకాకుళం నగరంలోని రైజ్ అకాడమీ సంస్థ విద్యార్థులు సత్తా చాటారని ఆ సంస్థ ప్రతినిధులు మాదిన బాలకృష్ణ, పరసరాపు బాబ్జి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంస్థలో శిక్షణ పొందిన జమ్ము రఘుకుమార్, పర్రి శివాజీ, మజ్జి సూర్యనారాయణ, పడాల బాలకృష్ణ, ఎస్.అనంత్‌కుమార్, డోల హరికృష్ణ తదితరులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని వెల్లడించారు. తాము వివిధ పోటీ పరీక్షలకు ఉన్నతంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలియజేశారు. మరిన్ని వివరాలకు 96664 16758 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి


నారీ శక్తి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ప్రముఖ సినీనటి నిధి అగర్వాల్ పిలుపునిచ్చారు. నగరంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన నిధి అగర్వాల్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సే నో టు డ్రగ్స్ కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ముందుగా డ్రగ్స్ వద్దు బ్రో, సంకల్పం, శక్తియాప్, నారీ శక్తి పోస్టర్లను డీఎస్పీ సీహెచ్ వివేకానంద సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐ పి.ఈశ్వరరావు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ స్పెషల్ ఆఫర్

శ్రీకాకుళం అర్బన్: బీఎస్ఎన్ఎల్ సంస్థ కేవలం రూ.1తో 30 రోజుల పాటు ప్రతిరోజూ 2 జీబీ డేటా ఉచితంగా పొందేందుకు అవకాశమిచ్చే 'ఆజాదీ కా అమృత్ ఆఫర్'ను ప్రారంభించినట్లు సంస్థ టెలికం జిల్లా జనరల్ మేనేజర్ నాయుడు మర్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

5న 'టీ తాగుతూ మాట్లాడుకుందాం'


సమావేశానికి హాజరైన ఉద్యోగులు

శ్రీకాకుళం రూరల్: ఉద్యోగుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 5వ తేదీన జిల్లాలో టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు శిమ్మ కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మాసపు సంతోష్‌కుమార్‌లు తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి రూ.25 వేల కోట్ల బకాయిలు, దాదాపు 27 సమస్యలు ఉన్నాయన్నారు. ఉద్యోగుల సమస్యలతో పాటు ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శిమ్మ సోమేశ్వరరావు, పూర్వపు అధ్యక్షుడు నారాయణరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కింజరాపు నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.